

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హరిచందనాలు

డా. దీప్తి కనుపర్తి

అమ్మకి నిర్వచనం - అర్థం నేను అమ్మనైనా పూర్తిగా అంతు చిక్కలేదు కాని, అమ్మ అని ఎక్కడ ఎప్పుడు విన్నా మా అమ్మ కళ్ళలో కదులుతుంది గుండెల్లో మెదులుతుంది. మా అమ్మ పేరు విజయలక్ష్మి కనుపర్తి, విజయ బక్షీగా స్నేహితులకి పాఠకులకు సుపరిచితురాలు. తెలుగు రీడర్‌గా పని చేసి క్రిందటి సంవత్సరమే పదవీ విరమణ చేసారు. అధ్యాపకురాలిగా, వక్తగా, రచయిత్రిగా మా అమ్మ గుణగణాలు ప్రాముఖ్యం. నా కన్నా తన విద్యార్థినీ విద్యార్థులు, సహోపాధ్యాయులు బాగా చెప్పగలరు. నేను మాత్రం అమ్మను అమ్మగానే మీకు పరిచయం చేస్తాను.



చిన్నతనంలో అన్నయ్యకు నాకు అన్నం తినిపిస్తూ రామాయణం భారతంతో పాటు, గాంధీ, అల్లూరి సీతారామరాజు కథలు మరెన్నో స్వాతంత్ర్య పోరాట గాథలు వినిపించేది. ఈ రోజుకూ దేశభక్తి గీతం వింటే నా వెంట్రుకలు నిక్కపొడుచుకోవడానికి కారణం అమ్మే! ట్రిపుల్ 'ఏ'లు నాకు చాలా ఇష్టం అంటూ అశోకుడు, అక్బర్, అలగ్జాండర్ చరిత్రలు కథలు కథలుగా కళ్ళకు కట్టినట్లు చెప్పేది. తన చిన్నతనం - చదువు - ఆటపాటలు మాతో పంచుకుంటూ మేము పుట్టక ముందు జీవితాన్ని కూడా మా ముందు ఆవిష్కరించింది మా ఆయుష్షు పెంచేసింది. ఇవన్నీ రోజు తను ఉద్యోగం చేసి వచ్చి ఇంట్లో ఎలా చేసేదా అని ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగా ఉంటుంది.

ఒక స్నేహితురాలిగా, గురువుగా, మార్గదర్శిగా, విమర్శకురాలిగా, అభిమానిగా నా జీవితంలోని ప్రతి మలుపులో తనదైన ముద్రవేసింది అమ్మ.

“When character is lost Everything is lost” అన్న గాంధీజీ సిద్ధాంతం నరనరాల్లో నాటుకుని పోయేలా చేసింది. వీరేశలింగం గారి వీరాభిమాని. అమ్మ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో తన ఉద్యోగ జీవితం ప్రారంభించింది.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో" అన్న ఆయన మాట అమ్మకు శిరోధార్యం. ఆరవతరగతి పరీక్షలు అవగానే నాకు మంచి మంచి నవలలు ఇచ్చి చదవమని నన్ను ప్రోత్సహించింది. నాలోని పాఠకురాలికి జన్మనిచ్చింది.

ఎప్పుడూ కళకళలాడుతూ, నవ్వుతూ, చకచకా పనులు చేసే అమ్మని చూసి నేను బాగా చిన్నగా ఉన్నప్పుడు "కులుకులమ్మ కన్నకూతురా? మెరుపులమ్మ మేనకోడలా?" అని పాడాను. ఇప్పటికీ ఆ విషయం గుర్తుకు వచ్చినప్పుడు ఇద్దరి పెదవులపై నవ్వు మెరుస్తుంది.

మాకు ఊహ తెలిసి ఏనాడు సినిమాలపై ఆసక్తి చూపని అమ్మ మాకు ఒక పూట బడి ఉన్నప్పుడు ఒక మధ్యాహ్నం మేట్నీకి బయలుదేర తీసింది. అప్పుడు నా వయస్సు పదకొండు, పన్నెండు సంవత్సరాలు ఉండి ఉంటాయి. 'నర్తనశాల' సినిమా ఎస్.వి.రంగారావుగారి నటనా వైశిష్ఠ్యాన్ని మేము గుర్తించాలని తన తపన. సైరంధ్రిని చూసిన ఆయన ఆవేశాన్ని అర్థం చేసుకునే వయసు అప్పుడు నాకు లేదు. కాని తర్వాత ఎప్పుడు అది చూసినా అమ్మ పడిన శ్రమ - తపన ఒక మధుర స్మృతి నాకు.

స్త్రీల ఆత్మాభిమానం, స్వయం ఉపాధి, సాధికారతను బలంగా నమ్మే అమ్మ వాటిని రక్షణ కవచాలుగా వాడాలి తప్ప అస్త్రాలుగా వాడకూడదు అని చెప్పింది. చేసి చూపించింది. ఎప్పుడూ భార్యా భర్తల మధ్య 'నీ' డబ్బు 'నా' డబ్బు అనే ప్రస్తావన తీసుకురాకూడదు అని సలహా ఇచ్చింది. ఇటువంటి సలహాలు ఎన్నో నా జీవితాన్ని స్వయంగా తీర్చిదిద్దుకోవడానికి సహకరించాయి.

అమ్మా నాన్నలది ప్రేమ వివాహం. వారికి ఒకరి పట్ల ఒకరికి ఉన్న ప్రేమ కంటే నా ప్రేమ తీసిపోదని నా ఉక్రోషం "మీరిద్దరూ లేకుండా మాకు 20 సంవత్సరాల జీవితం ఉంది కాని మీరు లేని నా జీవితం లేదు తెలుసా" అనేదాన్ని. అన్నయ్య, నేను పుట్టగానే ఎం.ఫిల్, పి.హెచ్.డి చేసిన అమ్మ ఏ రోజూ ఒత్తిడికి లోనై మాకు ఏ లోపం చేయలేదు. ఈ విషయంలో మా నాన్నగారు సిద్ధార్థ బక్ష్ గారి సహకారం మాటల్లో చెప్పలేనిది. చక్కని సంగీతం - సాహిత్యం ఆస్వాదించడం అమ్మకి ఎంతో ఇష్టం. మహేంద్ర కపూర్ పాట వస్తుంటే "ఎక్కడినుండి వస్తుంది?" అని అడిగేది. నేను "రేడియోలో.. " అంటే "కాదు గాలిలో తేలుతూ వస్తుంది గంధర్వగానం కదా" అని చమత్కరించేది.

అధ్యాపకురాలిగా, రచయిత్రిగా ఎందరినో ప్రభావితం చేసిన అమ్మే నాకు ప్రేరణ.

తెలిసి ఎదుటివారిని బాధించడం, పరుషంగా మాట్లాడడం ఎన్నడూ అమ్మలో చూడలేదు. అమ్మకీ నాకూ ఉన్న అనుబంధం చెప్పలేనిది. మేము తెలిసిన వారెవరైనా తల్లీ బిడ్డలు ఆత్మీయంగా ఉంటే మీలాగే ఉంటారు వాళ్ళు కూడా అని ఉదహరిస్తారు. మేము పొంగిపోతాము. నా బాధ అమ్మకు చెప్పకుండానే తెలిసిపోతుంది. అమ్మ ఏ విషయానికైనా మధనపడితే నాకు అంతే.

ఎంత చెప్పినా తక్కువే ఏమి చెప్పినా తక్కువే

తను కొవ్వొత్తిలా కరిగి మా జీవితానికి వెలుగునిచ్చింది

తను సమిధై మా జీవితాలకు పునాది వేసింది

బాల్యంలో తొలి గురువై, కౌమారంలో హెచ్చరిస్తూ యవ్వనంలో ఇష్ట సఖియై అమ్మ నా జీవితాన్ని మలిచింది.

అమ్మ మనసు వెన్న. ఆమె పలకరింపు, స్పర్శ, వాత్సల్యం, పరిమళం అన్నీ మధురం.



బయోటెక్ కంపెనీలో అసోసియేట్ సైంటిస్టుగా పనిచేస్తున్న దీప్తిగారు, భర్త ఫిరోజ్ గోరా, కుమార్తెలు స్మేరా, అమేయ లతో మెసాచుసెట్స్, కేంబ్రిడ్జిలో నివాసం. వ్రాయడం, చదవడం, ట్రావెలింగ్ హాబీలు